**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

**ఫోన్ - 8985829417**



# సూర్య ప్రభ

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 1 సంచిక: 347 | ఎడిటర్ : ఇ.ఎస్. రెడ్డి | శనివారం, జూన్ 7 2025 | పేజీలు : 4 | వెల : రూ.3/-


# కశ్మీర్‌లో కొత్త చరిత్ర




## నెరవేరిన వందేళ్ల కల - మోదీ ఖాతాలో మరో మైలురాయి..!!

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. తాజాగా జమ్మూ కశ్మీర్ లో కట్రా నుంచి కశ్మీర్‌కు వందేభారత్ రైలుకు జెండా ఊపడం ద్వారా ప్రపంచంలోని అత్యంత ఎత్తైన వంతెన దేశ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. దీంతో శివాలిక్, పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ కశ్మీర్ లోయకు రైలు ప్రారంభమయ్యింది.

దీంతో పాటు కట్రా లో రూ. 46వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోడీ ఆవిష్కరించారు. కట్రా -శ్రీనగర్ మధ్య రైలుకు ఆయన జెండా ఊపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ కేబుల్ బ్రిడ్జిను కూడా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రధాని జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఉధంపూర్‌లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన మోదీ.. వంతెన ప్రారంభానికి ముందు దానిని పరిశీలించారు. అలాగే జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మాట్లాడారు. ఉగ్రదాడి నేపథ్యంలో భారీ స్థాయిలో భద్రతా బలగాలను మోహరించారు. జమ్ముకశ్మీర్‌ను భారతదేశ రైల్వే నెట్‌వర్క్‌తో లింక్ చేయడం అనేది శతాబ్దం కిందటి కల. బ్రిటీష్ కాలంలో పునాదిరాళ్లు పడినా అది పట్టాలు ఎక్కలేదు. ఇప్పుడు నరేంద్ర మోడీ సర్కార్ హయాంలో వందేళ్ల కల నిజం అయింది. దీంతో చీనాబ్ వంతెన ద్వారా భారత రైల్వే నెట్‌వర్క్‌తో జమ్ముకశ్మీర్? అనుసంధానం అయింది. మరికొద్ది రోజుల్లో కాత్రా- శ్రీనగర్ వందే భారత్ రైలు మొదలవ్వనుండగా, భారత్‌కు ఎంతో కీలకమైన చీనాబ్ వంతెనను కేంద్రం జాతికి అంకితమిచ్చింది. జమ్మూ-శ్రీనగర్ రైలు లింక్ ప్రాజెక్టుకు తొలిసారిగా 1892 మార్చి 1న మహారాజా ప్రతాప్ సింగ్ పునాదిరాయి వేశారు. ఆ తర్వాత 1898లో మహారాజా రణ్‌బీర్ సింగ్ మరోసారి పునాదిరాయి వేశారు. పంజాబ్‌ను శ్రీనగర్, కశ్మీర్ లోయతో అనుసంధానించడానికి నాలుగు మార్గాలను అప్పట్లో ఎంపిక చేశారు. జమ్ము- బనిహాల్ మార్గం, జీలం లోయ - పూంచ్ మార్గం, రావల్పిండి - జీలం లోయ మీదుగా పంజార్ మార్గం, ఎగువ జీలం లోయలోని కలకో సెరాయ్ నుంచి హజారా మీదుగా అబోటాబాద్ మార్గంలను ఆనాడు ప్రతిపాదించారు. మీటర్, బ్రాడ్ గేజ్ ట్రాక్‌ల నిర్మాణానికి ఆనాడు సర్వేలు చేశారు. అయితే ఆ ప్రణాళికలన్నీ కార్యరూపు దాల్చలేదు. 1905లో అప్పటి బ్రిటీష్ పాలకులు కూడా ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను పరిశీలించారు. రియాసీ మీదుగా జమ్ము- శ్రీనగర్ మధ్య రైల్వే లైన్ నిర్మాణానికి ఆనాడు మహారాజా ప్రతాప్ సింగ్ అంగీకారం తెలిపారు. పీర్ పంజాల్ పర్వతశ్రేణిని దాటేందుకు నారో గేజ్ ట్రాక్‌ను నిర్మించాలని భావించారు. ఈ ప్రతిపాదనలు కూడా అటకెక్కాయి. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక కూడా చాలా సార్లు ఈ రైల్వే ప్రాజెక్టులపై చర్చ జరిగింది.కాగా 1981లో జమ్ము- ఉధంపూర్ రైల్వే లింక్ ప్రాజెక్టుకు కేంద్ర సర్కారు ఆమోదం తెలిపింది. 1994-95లో ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా మధ్య తుది రైలు లింక్ ప్రాజెక్టును మంజూరు చేశారు.


2002 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వే లైన్‌ను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. ఇప్పుడు ఆ ప్రాజెక్ట్ పూర్తైంది. కాత్రా - శ్రీనగర్ వందే భారత్ రైలును ఈ ఏడాది ఏప్రిల్ 19నే ప్రారంభించాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రదాడి తర్వాత కొన్ని వారాల పాటు భారత్, పాక్ మధ్య తీవ్రస్థాయిలో సైనిక ఘర్షణ జరిగింది. ఉధంపూర్- శ్రీనగర్- బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా కాత్రా - శ్రీనగర్ రైల్వే లైన్‌ను నిర్మించారు. తొలి దశలో కాత్రా - బారాముల్లా మధ్య రైళ్లు నడుస్తాయి. జమ్ము తావి రైల్వే స్టేషన్ విస్తరణ పనులు పూర్తయ్యాక రైలు సర్వీసులు జమ్ముకు కూడా అనుసంధానం అవుతాయి.

దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు కాత్రాలో దిగి కశ్మీర్‌కు మరో రైలును ఎక్కాల్సి ఉంటుంది. అదే విధంగా కశ్మీర్ నుంచి తిరిగి వచ్చేటప్పుడు, ప్రయాణికులు కాత్రా నుంచి తమ తదుపరి ప్రయాణానికి మరొక రైలును ఎక్కాలి. కాత్రా- శ్రీనగర్ వందేభారత్ వల్ల ఏటా అమర్‌నాథ్ యాత్ర సీజన్‌లో యాత్రికులకు ప్రయాణంలో ఎంతో సౌకర్యం కలుగనుంది.

## తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న కరోనా కేసులు - బిగ్ అలర్ట్..!!



కరోనా వైరస్ మహమ్మారి విజృంభిస్తోంది. పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏపీ, తెలంగాణ లోనూ కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ఏపీలో ఒకే రోజు మరో 11 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. కర్నూలులో గురువారం ఒక్కరోజే నలుగురికి, నెల్లూరు జిల్లాలో ఆరుగురికి కరోనా పాజిటివ్‌గా గురువారం నిర్ధారణ అయింది. విశాఖ కేజీహెచ్‌లో మరో కేసు నమోదయింది. నెల్లూరు జీజీహెచ్‌లో బుధవారం ఆరుగురికి కొవిడ్ పరీక్షలు నిర్వహించారు. వారిలో గురువారం నలుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఏపీతో పాటుగా తెలంగాణలోనూ కరోనా కేసులు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడులో 25 ఏళ్ల మహిళకు, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం ఏ.తిమ్మాపురం గ్రామానికి చెందిన 49 ఏళ్ల వ్యక్తికి, గోనెగండ్ల మండలం లింగందిన్నెకు చెందిన 45 ఏళ్ల వ్యక్తికి, కర్నూలు నగరానికి చెందిన 20 ఏళ్ల యువతికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వారిని కర్నూలు జీజీహెచ్‌లోని వీఐపీ నెగిటివ్ ప్రెజర్ రూంకు తరలించారు. కర్నూలు జీజీహెచ్‌లో కొవిడ్ పాజిటివ్‌ల సంఖ్య ఆరుకు చేరింది. బ్రెయిన్ ట్యూమర్‌తో కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగంలో చేరిన విజయనగరం జిల్లాకు చెందిన పద్నాలుగేళ్ల బాలికకు కరోనా సోకినట్టు నిర్ధారణ అయింది. గడిచిన నాలుగు రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక జ్వరం, జలుబు వంటి లక్షణాలతో బాధపడుతుండడంతో వైద్యులు ర్యాపిడ్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దీంతో సదరు బాలికను ఐసొలేషన్ వార్డుకు తరలించి ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేయించారు. ఫలితం రావాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద వెల్లడించారు. దీంతో, రెండు తెలుగు ప్రభుత్వాలు అలర్ట్ అయ్యాయి. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించాయి.




చర్ల: చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌జిల్లాలో నేషనల్ పార్క్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు నేత, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్ మృతి చెందారు. అతడి స్వస్థలం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచరా. భాస్కర్‌పై రూ. 25లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలిలో ఏకే-47ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి.




# అసంతృప్తులను తృప్తి పరిచేందుకు...

# దిద్దుబాటు చర్యలు!

## సీఎం రేవంత్ రెడ్డితో మీనాక్షి నటరాజన్ కీలక భేటీ

హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో వారు సమావేశమయ్యారు. గత పది రోజులుగా పార్టీ నేతలతో మీనాక్షి వరుస సమీక్షలు నిర్వహించారు. పార్టీ నేతల అభిప్రాయాలను సీఎం రేవంత్ రెడ్డితో మీనాక్షి నటరాజన్ చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి.. అలాగే అసెంబ్లీకి సంబంధించి నేతలతో ఉమ్మడి జిల్లాలకు కొంతమంది అబ్జర్వర్స్‌ను నియమించారు. వారందరితో వరుసగా పది రోజులపాటు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ విషయాలన్నీ రేవంత్ రెడ్డికి మీనాక్షి వివరించారు. అసంతృప్తితో ఉన్న కొందరు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను తృప్తి పరిచే విధంగా చర్యలు చేపట్టే దిశగా వారి చర్చలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలియవచ్చింది. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీకి అన్ని విధాలుగా అనుకూలంగా ఉండే పరిస్థితులను తీసుకు వచ్చే దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

**సమస్యలు చెక్ పెట్టే దిశగా చర్యాలు..**ఇంకా మీనాక్షి నటరాజన్ సమీక్షల్లో చాలా మంది నేతలు జిల్లాలు, నియోజకవర్గాల్లో ఒక నేతపై మరొక నేత ఫిర్యాదులు చేసుకున్నారు. దాంతో పాటు ఆధిపత్యపోరుకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లాలు, నియోజకవర్గాల్లో నేతలు సోషల్ మీడియాలో చాలా వీక్‌గా ఉన్నారని, చాలా మందికి సోషల్ మీడియాపై అవగాహన లేదని, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి వివరాలు తెలియవని, వాటిపై వారికి అవగాహన లేకపోవడంతో జనాలకు వివరించలేకపోతున్నారని మీనాక్షికి ఫిర్యాదులు అందాయి.

అన్ని విషయాలను ఆమె సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలు చూపవలసిందిగా ఆమె సీఎంను కోరారు. అలాగే కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని దీనికి చెక్ పెట్టాలని మీనాక్షి నటరాజన్ భావిస్తున్నారు. వీటన్నింటికి సంబంధించిన విషయాలను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం..** కాగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతినెలా రెండుసార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించనుంది. 15 రోజులకోసారి మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఆలస్యం లేకుండా వేగం పెంచాలని.. అందుకే రెండు మూడు నెలలకోసారి కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా కేబినేట్?లో సమీక్ష చేయాలని నిర్ణయించారు. మంత్రులతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు వీలుగా రెండు వారాలకోసారి మంత్రి వర్గ సమావేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి నెలలో మొదటి, మూడవ శనివారం రోజున మంత్రివర్గ సమావేశం నిర్వహించేందుకు ఆలోచన చేస్తున్నారు. కాగా ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు 17 సార్లు కేబినెట్ భేటీలు జరిగాయి.

## శ్రీ విజయ దుర్గా దేవి సమేత బంగారు మైసమ్మ దేవాలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ...

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభ)పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 130 – సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ లోని శ్రీ విజయ దుర్గాదేవి సమేత బంగారు మైసమ్మ దేవాలయ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు. అనంతరం బ్రహ్మోత్సవ వేడుకలకు





ఎమ్మెల్యే ని ఆహ్వానిస్తూ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటస్వామి, సెక్రెటరీ యాదగిరి, సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, శివ, బాలస్వామి, దొరబాబు, కుమార్, సూరి, వినోద్, మహేష్, శేఖర్, ప్రేమ్ కుమార్, దేముడు, రాము, జ్ఞానేశ్వర్, శోభన్, రవీందర్, రవి, రాము మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## కూల్చివేయ్యడం కాదు, కేసులు పెట్టి జైలుకు పంపండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమ మహేష్

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభ)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం లోని సర్వే నెంబర్ 326,307లలో గత కొంతకాలంగా ఆగిన కబ్జాలు నిర్మాణాలు నేడు మళ్ళీ వారం రోజుల నుండి ఎలాంటి భయం లేకుండా పగలు కుడా నిర్మాణాలు జరుగుతున్నాయని, రెవెన్యూ అధికారులు పదుల సంఖ్యలో నెలకొన్న అక్రమంగా నిర్మాణాలలో ఒకటి అర నిర్మాణాలు కూల్చి చేతులు దులుపుకోవడం సరికాదని, వెంటనే



కూల్చివేతలను తెలివిగా అడ్డుకుంటున్న వారిని అరెస్టు చేసి శిక్షించాలని నేడు మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్ ఐ కరీముల్లా కి సిపిఐ నాయకత్వం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అక్రమ నిర్మాణాలను కూల్చివేయ్యకపోతే స్వయంగా ప్రజలను కదలిసుకొని గుడిసెలు వేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్ రావ్, నాయకులు నర్సింహా రెడ్డి, రవి, సుంకిరెడ్డి, సామెల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమ, ప్రారంభోత్సవాలలో పాల్గొన్న కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో మహానగర్ లో రూ.11 లక్షల వ్యయంతో నూతనంగా GHMC పార్క్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఓపెన్ జిమ్ ని ప్రారంభించి తదుపరి రుక్మిణి ఎస్టేట్స్ లో రూ.41.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం లో కుత్బుల్లాపూర్ శాసన సభ్యులు కేపీ.వివేకానంద తో కలిసి పాల్గొని రోడ్డు ని ప్రారంభించిన బీజేపీ 132 జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి ఈ





కార్యక్రమం లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి, రుక్మిణి ఎస్టేట్స్ అధ్యక్షులు అప్పల శేఖర్, మహానగర్ అధ్యక్షులు కుమార్, నర్సింగ్ రావు, సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, మాధవ రెడ్డి, చంద్రారెడ్డి, వీరారెడ్డి, పెద్దింటి సాయిలు, నర్సింలు, స్వామి, వెంకట్ రెడ్డి, కవిరాజ్, శంకర్ రెడ్డి, నవీన్, శ్రీనివాస్, సురేష్, వినోద్, శ్రీనివాస్, ప్రదీప్, శివ, కుమార్, రాజేశ్వర్, సత్యనారాయణ, రాజు, శ్రీకాంత్ రెడ్డి, నాగదీప్ గౌడ్, మహేష్, వర్మ, ఈశ్వర్, శివ, హేమంత్ పాల్గొన్నారు.

# జలమండలి మహా విస్తరణ



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సేవలు అందిస్తున్న జలమండలి పరిధి మరింత విస్తరిస్తోంది. ఇప్పటి వరకు అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేస్తున్న జలమండలి ఓఆర్ఆర్ వెలుపల ఉన్న ప్రాంతానికి అందించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిపై ఇప్పటికే అధికారులు ప్రాథమిక ప్రణాళికను సిద్ధం చేశారు.

ఓఆర్ఆర్ వెలుపల ఏయే ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది? ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలనే అంశంపై జలమండలి కసరత్తు మొదలు పెట్టింది. రీజినల్ రింగ్‌రోడ్డు లోపల అభివృద్ధికి మార్గం సుగమం అవుతున్న నేపథ్యంలో జలమండలి పరిధిని విస్తరించడం ద్వారా తాగునీటి సరఫరాకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

**గ్రామాలకూ సరఫరా చేసేలా..**

గ్రేటర్ చుట్టుపక్కల ఉన్న పురపాలికల్లోని కొన్ని ప్రాంతాలు ఓఆర్ఆర్ వెలుపల ఉన్నాయి. ఈ ప్రాంతాలన్నింటినీ జలమండలి పరిధిలోకి తీసుకురావడం ద్వారా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధ్యమని చెబుతున్నారు. శంషాబాద్, నార్సింగి, తుక్కుగూడ, పెద్దఅంబర్‌పేట, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు ఓఆర్ఆర్‌కు అటూఇటూ ఉన్నాయి. వీటి పరిధిలోని కొన్ని గ్రామాలు ఓఆర్ఆర్ వెలుపలా ఉన్నాయి. లోపల ఉన్న గ్రామాలకు జలమండలి నీటిని సరఫరా చేస్తోంది. ఆయా ప్రాంతాల్లో భారీగా రియల్ కార్యకలాపాలు జరుగుతుండటంతో తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి విస్తరణ ప్రణాళికపై సమీక్షించారు.

**గోదావరి జలాలు రానుండటంతో..**

గోదావరి 2,3 దశల ప్రాజెక్టుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. రూ.7360 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలు నగరానికి సరఫరా చేయనున్నారు. ఇందులో 15 టీఎంసీలను నేరుగా తాగునీటి అవసరాలకువాడతారు. రెండేళ్లలో ఈ జలాలు అందుబాటులోకి రానుండటంతో దీనికి అనుగుణంగా కొత్త ప్రాంతాలను నీటిని అందించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది.

ప్రస్తుతం జలమండలి పరిధి (చదరపు కిలోమీటర్లలో)
కోర్ సిటీలో : 169.3
చుట్టుపక్కల : 518.9
ఓఆర్ఆర్ గ్రామాల ప్రాంతం 762
మొత్తం జలమండలి పరిధి : 1,450
ప్రస్తుత కనెక్షన్లు: 13.72 లక్షలు
జనాభా: 1.30 కోట్లు
రోజుకు సరఫరా అవుతున్న నీరు: 550 ఎంజీడీలు

# ఆచార్యులు లేక జేఎన్టీయూలో బీబీఏ కోర్సు రద్దు



హైదరాబాద్ : విద్యార్థులకు బోధించేందుకు ఆచార్యులు లేని కారణంగా జేఎన్టీయూ అధికారులు బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (బీబీఏ) కోర్సును రద్దు చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను నిలిపివేశారు. 'దోస్త్' పోర్టల్ నుంచి బీబీఏ (రెగ్యులర్) కోర్సును తొలగించాలంటూ ఉన్నత విద్యా మండలికి సమాచారమిచ్చారు. మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రధాన అంశాలు మార్కెటింగ్, ఫైనాన్స్, మానవ వనరుల నిర్వహణ, ప్రొడక్షన్, ఆపరేషన్, సప్లై ఛెయిన్ మేనేజ్‌మెంట్‌లను బోధించేందుకు వీలుగా మూడేళ్ల క్రితం ఈ కోర్సును ప్రవేశపెట్టారు. ఆచార్యులు ఉద్యోగ విరమణ చేయడంతో అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిబంధనల మేరకు రెగ్యులర్ ఆచార్యులు లేకపోవడంతో కోర్సును రద్దు చేశారు.


**70 శాతం ఉద్యోగ విరమణ**

ఇంజినీరింగ్ కోర్సుతో పాటు మేనేజ్‌మెంట్ కోర్సులను నిర్వహించాలని జేఎన్టీయూ ఉన్నతాధికారులు మూడేళ్ల క్రితం నిర్ణయించారు. బీబీఏ రెగ్యులర్, బీబీఏ(డేటా అనలిటిక్స్) కోర్సులను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఆర్భాటంగా ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సులో 60 మందికి ప్రవేశం కల్పించారు. జేఎన్టీయూలో బీబీఏ కోర్సు చదివితే క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు ఎంబీఏ చదివేందుకు అవకాశాలు లభిస్తాయని విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రెండో సంవత్సరం వచ్చేసరికి ఆచార్యుల్లో 70శాతం ఉద్యోగ విరమణ పొందారు. మూడో సంవత్సరం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మిగిలిన ఆచార్యులతో పూర్తి చేశారు. విద్యార్థులు మూడో సంవత్సరం బీబీఏ పూర్తిచేసేలోగా ఒక్కరు మినహా శాశ్వత ఆచార్యులందరూ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో బీబీఏ(రెగ్యులర్) కోర్సును కొనసాగించలేమని నిర్ణయం తీసుకున్నారు.

**ముప్పును ఊహించకుండా...**

అప్పట్లో అధికారులు సరైన అవగాహన లేకుండా, ఆచార్యులున్నారా? లేరా? అని తెలుసుకోకుండా బిజినెస్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును ప్రవేశపెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆచార్యులు పదవీ విరమణ చేస్తే విద్యార్థులకు ఆయా సబ్జెక్టులు ఎవరు బోధిస్తారు? అని, ఏఐసీటీఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్సును రద్దు చేయడంతో పాటు యూనివర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతింటుందనే ఆలోచనలేకుండా అప్పటి అధికారులు వ్యవహరించారు. దీనిపై రిజిస్ట్రార్ డాక్టర్ కేవీరావును వివరణ కోరగా... ప్రవేశాలు రద్దు చేశామని తెలిపారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి నుంచి తాఖీదులు రాకూడదనే కోర్సును కొనసాగించడం లేదన్నారు.

# డివిజన్ల పునర్విభజనకు కసరత్తు



కరీంనగర్ : స్థానిక సంస్థల ఎన్నికలకు పురపాలక శాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది జనవరి 28తో పాలకవర్గాల గడువు ముగియడంతో పురపాలికలు, నగరపాలికల్లో ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చింది. కరీంనగర్ నగరపాలికలో శివారు గ్రామాలను చేర్చిన నేపథ్యంలో డివిజన్ల పునర్విభజన తప్పనిసరిగా మారింది. ప్రస్తుతమున్న 60 డివిజన్లను 66కి పెంచారు. అయిదు గ్రామాలతో పాటు కొత్తపల్లి మున్సిపాలిటీ నగరంలో విలీనం కావడంతో ఓటర్ల సంఖ్య పెరగనుంది. మరో ఆరు డివిజన్లు పెరగడంతో నగర స్వరూపం పూర్తిగా మారనుంది. ఏ డివిజన్‌లో ఎంత మంది ఓటర్లు ఉండాలనే విషయమై ఇప్పటికే ప్రక్రియ పూర్తి చేశారు. తాజాగా డివిజన్ల పునర్విభజనపై ముసాయిదా జారీ కోసం ఉత్తర్వులు జారీ చేశారు.

డివిజన్‌కు 5 వేల మంది ఓటర్లు

పెరిగిన డివిజన్ల ఆధారంగా ఓటర్లు, సరిహద్దులతో వార్డుల పునర్విభజనను ఫిబ్రవరి, మార్చి నెలల్లో పూర్తి చేశారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, పట్టణ ప్రణాళిక అధికారులు, ఉద్యోగులు కలిసి విలీన గ్రామాలను కలుపుకొని ఏయే డివిజన్ ఎక్కడి వరకు రానుందనే విషయాలపై చర్చించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఓటర్ల లెక్క ప్రకారం ఒక్కో డివిజన్‌లో 4,493 నుంచి 5 వేల మంది ఓటర్లు ఉండనున్నారు. ఈ మేరకు ప్రాథమిక సమాచారాన్ని రాష్ట్ర పురపాలక శాఖకు పంపించారు.

**నేటి నుంచి 19 రోజులు**

డివిజన్ల పునర్విభజనపై రాష్ట్ర పురపాలక శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు 19 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

**సరిహద్దులపై ప్రచారం**

డివిజన్ల సరిహద్దులు నిర్ణయించారంటూ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరిగింది. ఓటర్లు ఎక్కువ తక్కువ ఉండటం, భౌగోళిక స్వరూపం గందరగోళంగా మారడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ జాబితా అధికారికంగా చేపట్టింది కాదని అధికారులు తేల్చి చెప్పారు.

**ఇదీ షెడ్యూలు**

3న భౌగోళికంగా పునర్విభజన చేస్తూ మున్సిపాలిటీ ద్వారా ముసాయిదా ప్రతిపాదనల తయారీ.

4న వార్డుల విభజన ప్రతిపాదనకు నోటీసు ఇవ్వడం, సాధారణ ప్రజలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు లేఖలు ఇవ్వడం, పత్రికల్లో ప్రచురించడం.

5 నుంచి 11 వరకు ఏడు రోజుల పాటు అభ్యంతరాలు, అభిప్రాయ సేకరణ, సూచనలు, పరిష్కారాలు కోరడం.

12 నుంచి 16 వరకు అయిదు రోజుల పాటు స్వీకరించిన అభ్యంతరాలపై విచారణ.

17 నుంచి 18 వరకు రెండు రోజుల పాటు అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత కలెక్టర్ ఆమోదం తీసుకోవడం.

19న పురపాలక శాఖకు నివేదిక సమర్పణ.

20న పురపాలక శాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందజేయడం.

21న తుది నోటిఫికేషన్ జారీ.

ప్రస్తుత డివిజన్లు : 60
కొత్తగా ఏర్పడేవి : 6
నగర ఓటర్లు : 2,54,745
విలీన గ్రామాల ఓటర్లు: 41,814

## బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ చేతుల మీదుగా "హెూటల్ తులిప్స్ గ్రాండ్" ప్రారంభం....

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభ) సూరారం ప్రధాన రహదారి లోని మల్లారెడ్డి హాస్పిటల్ ప్రక్కన నూతనంగా ఏర్పాటుచేసిన "హెూటల్ ఫిలిప్స్ గ్రాండ్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై "హెూటల్ తులిప్స్ గ్రాండ్" ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.... సేవారంగంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారాలలో హెూటల్ రంగం ఒకటని, ఇప్పటికే అనేక శాఖలను ఏర్పాటుచేసి ప్రజలలో మంచి పేరును సంపాదించిన హెూటల్ తులిప్స్ గ్రాండ్







సూరారం శాఖ మరింత దినదినాభివృద్ధి చెందాలన్నారు. రెస్టారెంట్ తో పాటు, బ్యాంకెట్ హాల్ లను ఏర్పాటు చేయడం ద్వారా శుభకార్యాలు నిర్వహించుకునే వారికి హెూటల్ తులిప్స్ గ్రాండ్ అనువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, విజయ్ శేఖర్ గౌడ్, హేమలత సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## హెూటల్ తులిప్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్...







కుత్బుల్లాపూర్ (సూర్యప్రబా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారంలోని హెూటల్ తులిప్స్ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిథిగా పాల్గొన్నారు..అనంతరం తులిప్స్ హెూటల్ యాజమాన్యన్ని కూన శ్రీశైలం గౌడ్ అభినందించారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మాత్రలు వేస్తూ.. గుట్టుగా చిదిమేస్తూ..

ఆదిలాబాద్ : జిల్లాలో వైద్య చట్టాలు, నిబంధనలేవీ అమలు కావటం లేదని ఇటీవల జరిగిన ఘటనలు రుజువు చేస్తున్నాయి. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, గర్భ స్రావాలు చేయటం చట్టవిరుద్ధం.

పీసీ పీఎన్‌డీటీ(ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్ చట్టం–1994) ప్రకారం లింగ నిర్ధారణ చేస్తే శిక్షార్హులవుతారు. ఎంటీపీ(మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) చట్టం–1971 ప్రకారం గర్భవతి అయిన మహిళలకు గర్భస్థ శిశివు కారణంగా ప్రాణాపాయం ఉండటం లేదా కడుపులో శిశువు మృతి చెంది ఉండటం స్కానింగ్ ద్వారా తెలిసినప్పుడు అర్హులైన వైద్యుల సమక్షంలోనే గర్భస్రావం చేయాల్సి ఉంది.

జిల్లాలో ఆర్ఎంపీ వైద్యులు ఇబ్బడిముబ్బడిగా గుట్టుచప్పుడు కాకుండా గర్భస్రావాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బుకు ఆశ పడి గర్భస్రావం మాత్రలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గర్భవతి నెలలను బట్టి నెలకి రూ.రెండు వేలకు పైచిలుకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఆర్ఎంపీలు ఇలాంటి వారిని తమకు తెలిసిన నర్సింగ్‌హెూంలకు తీసుకెళ్లి గర్భస్రావాలు చేయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడకు చెందిన సేపూర్‌వార్ ప్రశాంత్ తన భార్య ప్రవళికకు బలవంతంగా ఇటీవల గర్భస్రావం మాత్రలను వేశాడు. అతను కొత్తగా ఇల్లు కట్టుకుంటున్న సందర్భంగా భార్య గర్భవతి కావటం మంచి శకునం కాదన్న మూఢ నమ్మకంతో మాత్రలు ఇచ్చాడు. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురవగా మొదట రిమ్స్‌కు అనంతరం హైదరాబాద్‌కు తరలించినప్పటికీ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. అయితే గర్భస్రావం కోసం మాత్రలు ఇచ్చిన వారెవరన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గుడిహత్నూర్ మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల 17 ఏళ్ల బాలిక గర్భం దాల్చింది. కుటుంబ సభ్యులు అదే గ్రామంలోని ఒక ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించగా ఏడు నెలల గర్భవతిగా ఉన్న ఆమెకు గర్భస్రావం మాత్రలు ఇచ్చారు.




యాదాద్రి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ఇవాళ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం తిరుమలాపూర్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మీద రేవంత్ విమర్శలు, సెటైర్లు సంధించారు. సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన అంశాల విషయానికొస్తే.. 'తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. యాదాద్రి పేరుని యాదగిరిగుట్టగా మార్చాం. తిరుమల మాదిరిగా యాదగిరిగుట్ట అభివృద్ధి. టీటీడీ మాదిరిగా వైటీడీ ఏర్పాటు చేశాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపుర నిర్మాణం. కొండపై భక్తులు నిద్రించేలా, ఆటోలు నడిచేలా చేశాం. త్వరలో యాదగిరిగుట్ట ఆలయ కమిటీ ఏర్పాటు. స్థానిక విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి తీసుకెళ్తాం.' అని సీఎం చెప్పారు. గంధమల్ల ప్రాజెక్టును గతంలో ఎందుకు పూర్తిచేయలేదని ఈ సందర్భంగా సీఎం రేవంత్, గత బీఆర్ఎస్ సర్కారుని నిలదీశారు. ఇంకా సభలో సీఎం ఏం మాట్లాడారంటే.. 'నల్లగొండ రైతుల కష్టాలు తీర్చుతాం. కమీషన్ల కోసమే గత ప్రభుత్వం కాళేశ్వరం కట్టింది. మూసీ ప్రక్షాళన చేసి చూపిస్తాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. పేదల ఇళ్లు కూలగొడుతున్నామంటూ విష ప్రచారం చేశారు. మూసీ నది ప్రక్షాళనను అడ్డుకుంటున్నారు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం. సబర్మతి, గంగ నదులు ప్రక్షాళన చేస్తున్నప్పుడు.. మూసీ ప్రక్షాళన ఎందుకు చేయకూడదు?. మూసీ ప్రాంతంలో ప్రజల కష్టాలు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా?. నల్గొండ జిల్లా రైతులు బాగుపడకూడదనే BRS కుట్ర. SLBCని గత BRS ప్రభుత్వం పట్టించుకోలేదు'. అని సీఎం రేవంత్ అన్నారు. అటు ప్రతిపక్షపార్టీ BRS పైన సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. అది బీఆర్ఎస్ కాదు.. అది DRS (దెయ్యాల రాజ్య సమితి)పార్టీ అంటూ రేవంత్ విమర్శలు చేశారు. 'BRSలో దెయ్యాలు ఉన్నాయని కవితే అన్నారు. ఇంటి ఆడబిడ్డే దెయ్యాలు ఉన్నాయి అంటే నోరు విప్పని పరిస్థితి..కొరివి దెయ్యాలను తెలంగాణ పొలిమేర దాటేవరకు తరిమికొట్టాలి.. పదేళ్లపాటు తెలంగాణను దోచుకుతిన్నారు. బంగారు తెలంగాణ ముసుగులో బొందలగడ్డ చేశారు. తెలంగాణను బొందలగడ్డ చేసిన ప్రతి వెధవ మాట్లాడుతున్నాడు. తెలంగాణను రూ.8 లక్షల కోట్ల అప్పుల ఊబిలో పడేశారు. పదేళ్లు దోచుకుతిన్న మీరా.. నన్ను ప్రశ్నించేది?. యాదగిరిగుట్టలో అపచారం వల్లే గత ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంది. గతంలో చేసిన పాపాల వల్లే కిందపడి మక్కెలు ఇరగ్గొట్టుకున్నారు. వాసాలమర్రిని ఆదర్శ గ్రామం చేస్తామని చెప్పి ఇళ్లు కూల్చేశారు. ఎర్రవల్లికి రోడ్డు వేసుకునేందుకే వాసాలమర్రిని కూల్చేశారు' అని రేవంత్ విపక్ష బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు.




ఆయుర్వేద వైద్య విద్యనభ్యసిస్తూ మావోయిజం పట్ల ఆకర్షితుడైన తెంటు లక్ష్మీనరసింహచలం అలియాస్ సుధాకర్ అడవి బాట పట్టారు. సుదీర్ఘ కాలంగా సాయుధ పోరాటంలో పాల్గొన్న ఆయన.. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు స్థాయికి ఎదిగారు. 40 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్న ఆయన.. 2004లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చలకు హాజరయ్యారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌జిల్లాలో నేషనల్ పార్క్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు నేత, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్ మృతి చెందారు. అతడి స్వస్థలం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచరా. భాస్కర్‌పై రూ. 25లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఘటనాస్థలిలో ఏకే-47ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై నెలకు రెండు సార్లు క్యాబినెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. 15 రోజులకోసారి భేటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విధాన నిర్ణయాల్లో జాప్యాన్ని నివారించేందుకు ఈమేరకు చర్యలు తీసుకున్నారు. ప్రతి నెల మొదటి, మూడో శనివారం క్యాబినెట్ భేటీ జరగనుంది.




## నా కణతపై తుపాకీ పెట్టినా నిజమే చెప్తా.. కాళేశ్వరం సమాచారమంతా వాళ్లిద్దరి వద్దే: ఈటల

హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ ఎదుట భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విచారణ ముగిసింది. భారాస హయాంలో ఆర్థిక మంత్రిగా ఈటల పనిచేసిన నేపథ్యంలో ఆయన్ను కమిషన్ విచారించింది. అనంతరం ఈటల మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమాచారమంతా కేసీఆర్, హరీశ్‌రావు వద్దే ఉందన్నారు. ఇందులో ఆర్థిక శాఖ పాత్ర పెద్దగా లేదని చెప్పారు. ఆ శాఖకు అన్ని విషయాలూ తెలియవని పేర్కొన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో నా పాత్రేమీ లేదు. ప్రాజెక్టు రీ డిజైనింగ్ కోసం క్యాబినెట్ సబ్ కమిటీని కేసీఆర్ ఏర్పాటు చేశారు. దీనికి అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఛైర్మన్‌గా ఉన్నారు. నీటి లభ్యత అంశాన్ని దృష్టిలో పెట్టుకొని మేడిగడ్డ వద్ద ఆనకట్ట నిర్మాణం చేపట్టారు. ఆనకట్టల నిర్మాణం సాంకేతిక నిపుణులకు సంబంధించిన అంశం. ఆ నిర్మాణంపై రాజకీయ నాయకులకు ఏం తెలియదు. రూ.63 వేల కోట్లతో మొదట కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రతిపాదన చేశారు. తర్వాత అనేక కారణాలతో ప్రాజెక్టు వ్యయం రూ.82 వేల కోట్లకు పెరిగింది. ఇవాళ కమిషన్ ఆర్థికపరమైన అంశాలపై ప్రశ్నలు అడిగింది. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలపై ఆర్థిక శాఖ ప్రమేయం ఉందా అని అడిగారు. దీనిపై ఆర్థిక శాఖకు ఏమాత్రం సంబంధం లేదు. ఇది పూర్తిగా ఇరిగేషన్ శాఖకు సంబంధించినది. నా కణతపై తుపాకీ పెట్టినా సరే.. నిజమే మాట్లాడతా. తప్పుఒప్పులు ఎవరివో తెలంగాణ ప్రజలు తేలుస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రిపోర్టులు బయటపెట్టాలి. కాళేశ్వరం అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు. ప్రాజెక్టు నష్టాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి.. కఠినంగా శిక్షించాలి. ఈ ప్రాజెక్టు తన మానస పుత్రిక అని కేసీఆర్ వందల సార్లు చెప్పారు. ఏ పార్టీలో ఉన్నా, ఏ పదవిలో ఉన్నా నైతిక విలువలు పాటించా" అని ఈటల రాజేందర్ అన్నారు.

**కమిషన్ ఎదుట ఈటల తెలిపిన అంశాలివే..!** క్యాబినెట్ నిర్ణయం మేరకే ఆనకట్టల నిర్మాణం జరిగిందని ఆయన కాళేశ్వరం కమిషన్‌కు ఈటల చెప్పినట్లు సమాచారం. సాంకేతిక కమిటీ, క్యాబినెట్ కమిటీ సిఫార్సు మేరకు క్యాబినెట్ నిర్ణయం జరిగిందని చెప్పారు. సీడబ్ల్యూసీ, మహారాష్ట్ర అభ్యంతరాల దృష్ట్యా ప్రాజెక్టు లొకేషన్‌ను తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చినట్లు చెప్పారు. నిధుల కొరత దృష్ట్యా కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక, తాగునీటి వినియోగంపై డబ్బు వసూలు చేయాలని డీపీఆర్‌లో ఉందని చెప్పారు. బ్యారేజీల నిర్మాణంలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందా అని ఈటలను కమిషన్ ప్రశ్నించింది. నిర్మాణ అంశాలన్నీ నీటిపారుదల శాఖ కిందకే వస్తాయని ఈటల బదులిచ్చారు.

## తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం: మంత్రి ఉత్తమ్




హైదరాబాద్: బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్‌ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్రమంత్రులు సీఆర్‌పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు. "ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని.. వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. చట్టం ప్రకారం ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో వివరించాం. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంత వరకైనా పోరాడుతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు భారాస సహకరించింది. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు ఏపీకి వెళితే భారాస హయాంలో 1,254 టీఎంసీలు తరలించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది భారాస ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు భారాస నేతలు నాటకాలు ఆడుతున్నారు"అని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.

## తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే స్పందించరేం?: హరీశ్‌రావు

దుబ్బాక: తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే బనకచర్ల అంశంపై రాష్ట్ర భాజపా నేతలు ఎందుకు స్పందించడం లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలు ఆ పార్టీకి పట్టవా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాకలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ సమావేశంలో బనకచర్ల అంశంపై ప్రధాని మోదీని ఎందుకు ప్రశ్నించలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. అపెక్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని ఎందుకు కోరడం లేదో చెప్పాలన్నారు. "సుప్రీంకోర్టుకు వెళ్లయినా సరే బనకచర్లను ఆపుతాం.

ఎలాంటి అనుమతులు లేకున్నా ఏపీకి కేంద్రం నిధులిస్తోంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖలు రాసి చేతులు దులిపేస్తున్నారు. శ్రీశైలం కుడి కాల్వ లైనింగ్ పనులు జరుగుతున్నా.. అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లమన్నా స్పందించడం లేదు. శ్రీశైలం కుడి కాల్వ లైనింగ్ పనులను వెంటనే నిలిపివేయించాలి. బనకచర్లపై రాష్ట్ర భాజపా నేతలు ఎందుకు నోరు మెదపడం లేదు? గోదావరి జలాలపై



తెలంగాణ శాశ్వతంగా హక్కు కోల్పోయే ప్రమాదముంది. శ్రీశైలం కుడి కాల్వ లైనింగ్ పనులు పూర్తయితే రోజుకు 90 వేల క్యూసెక్కుల నీటిని ఏపీకి తీసుకెళ్తారు. అదే జరిగితే హైదరాబాద్‌కు తాగునీరు కూడా దక్కదు. కేఆర్‌ఎంబీ కళ్లు మూసుకుని ఏపీకి దాసోహమైంది" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## కాంగ్రెస్ నేత పిటిషన్.. కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, జూన్ 6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు (శుక్రవారం) సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి



వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈరోజు విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ



హైదరాబాద్: గుండెపోటుతో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. మధ్యాహ్నం ఆసుపత్రికి చేరుకున్న మంత్రి.. మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగ్గా ఉందని పేర్కొన్నారు. ఆయన తనకు సన్నిహితుడని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




## ఈ ఏడాది ఖైరతాబాద్‌లో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి.. ఘనంగా తొలిపూజ

హైదరాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి ఈ ఏడాది శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఖైరతాబాద్‌లో జరిగే మహాగణపతి 71వ వేడుకలకు శుక్రవారం నిర్జల ఏకాదశి సందర్భంగా కర్ర పూజ (తొలిపూజ) జరిగింది. ఈ సందర్భంగా ఈ ఏడాది రూపుదిద్దుకోనున్న విగ్రహ నమూనా చిత్రాన్ని విడుదల చేశారు. ఈసారి 69 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రపంచంలోనే ఫస్ట్ ఎయిర్ లైన్స్ సంస్థ ఏదో తెలుసా ? అది ఏ దేశంలో ఉందంటే ?

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకోవడానికి విమాన ప్రయాణాన్ని ఎంచుకుంటున్నారు. ఎందుకంటే విమానంలో ప్రయాణించడం వల్ల ఎక్కడికైనా త్వరగా, వేగంగా, సులభంగా చేరుకోవచ్చు. మీరు కూడా చాలాసార్లు విమాన ప్రయాణం చేసి ఉంటారు. అయితే, ప్రపంచంలో మొట్టమొదటి ఎయిర్‌లైన్స్ ఎలా ప్రారంభమయ్యాయో ఎప్పుడైనా ఆలోచించారా? ప్రపంచంలో మొట్టమొదటి విమానయాన సంస్థ ఏమిటి, దానిని ఎలా ప్రారంభించారు అనే వివరాలను తెలుసుకుందాం. ప్రపంచంలో మొట్టమొదటి విమానయాన సంస్థ పేరు సెయింట్ పీటర్స్‌బర్గ్-టాంపా ఎయిర్‌బోట్ లైన్. ఈ ఎయిర్‌లైన్ జనవరి 1, 1914న ప్రారంభమైంది. ఈ ఎయిర్‌లైన్ సెయింట్



పీటర్స్‌బర్గ్ నుంచి టాంపాకు తన మొదటి విమానాన్ని నడిపింది. ఈ మొదటి విమానంలో సెయింట్ పీటర్స్‌బర్గ్ మేయర్ అబ్రహం సి. ముఖ్యంగా ప్రయాణించారు. ఆయన సుమారు 400 డాలర్లు బిడ్ వేసి టిక్కెట్‌ను వేలంలో గెలుచుకున్నారు. అయితే, ఈ ఎయిర్‌లైన్ కేవలం మూడు నుంచి నాలుగు నెలలు మాత్రమే నడిచింది. ఈ ఎయిర్‌లైన్ బెనోయిస్ట్ ఎయిర్‌బోట్ అనే విమానాన్ని ఉపయోగించింది. ఇది నీటిపై ఎగరడానికి, ల్యాండ్ అవ్వడానికి కూడా వీలుగా ఉండేది. సెయింట్ పీటర్స్‌బర్గ్-టాంపా ఎయిర్‌బోట్ లైన్‌ను పెర్సివల్ ఇలియట్ ఫాన్స్‌లర్, థామస్ బెనోయిస్ట్, ఆంథోనీ జానస్ కలిసి స్థాపించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్-టాంపా ఎయిర్‌బోట్ లైన్ ప్రపంచంలోనే మొట్టమొదటి ఫిక్స్‌డ్-వింగ్ ఎయిర్‌లైన్, కానీ 1914లో ఈ ఎయిర్‌లైన్‌ను మూసివేశారు. ఈ ఎయిర్‌లైన్ సెయింట్ పీటర్స్‌బర్గ్, టాంపా బే తర్వాత సుమారు 37 కిలోమీటర్ల దూరం ఎగిరింది. సెయింట్ పీటర్స్‌బర్గ్ , టాంపా మధ్య ప్రయాణాన్ని వేగవంతం చేయడం, సులభతరం చేయడం సెయింట్ పీటర్స్‌బర్గ్-టాంపా ఎయిర్‌బోట్ లైన్ ముఖ్య ఉద్దేశం. ఈ ఎయిర్‌లైన్ రవాణా రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. అంతేకాకుండా, ఈ ఎయిర్‌లైన్ గ్లోబల్ ఏవియేషన్ పరిశ్రమకు పునాది వేసింది.

# అమెరికా ఆతిథ్య రంగాన్ని కుదిపేస్తున్న భారతీయ హోటల్ యజమానులు



నేడు అమెరికాలోని హోటల్ పరిశ్రమ సమావేశాలకు హాజరైతే ఒక స్పష్టమైన దృశ్యం కనిపిస్తుంది: ఎక్కడ చూసినా భారతీయ హోటల్ యజమానులే. సంవత్సరాలుగా వారు ఈ రంగంలో బలమైన స్థానాన్ని సంపాదించారు. ముఖ్యంగా బడ్జెట్ , మధ్య-శ్రేణి హోటళ్లలో వారి యాజమాన్యం ఎక్కువగా ఉంది. అయితే ఈ విస్తరణతో కొంత ఘర్షణ కూడా ఇప్పుడు అమెరికా వర్గాల్లో మొదలైంది. కొంతమంది దీర్ఘకాలిక అమెరికన్ హోటల్ యజమానులు తమ వ్యాపార శైలి కనుమరుగవుతోందని ఆందోళన చెందుతున్నారు. సమస్య కేవలం యజమానుల సంఖ్యలోనే లేదు. చాలా మంది భారతీయ యజమానులు ఖర్చులను తగ్గించడంపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఆస్తులను మెరుగుపరచడానికి పెట్టుబడి పెట్టడానికి వెనుకాడటం.. ధరలను చాలా తక్కువగా ఉంచడం వల్ల మార్కెట్ విలువ పడిపోవడం వంటి ముఖ్యమైన ఫిర్యాదులు అమెరికన్ హోటల్ యజమానులు చేస్తున్నారు.. ఇది పరిశ్రమ ప్రమాణాలను దిగజారుస్తుందని కొందరు వాదిస్తుంటే, మరికొందరు ఇది కేవలం భిన్నమైన పోటీ విధానం మాత్రమే అని అంటున్నారు.పరిశ్రమలోని కొందరు వ్యక్తులు "భారతీయ మనస్తత్వం" అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది స్థిరమైన వృద్ధి కంటే స్వల్పకాలిక మనుగడపై దృష్టి పెట్టడాన్ని సూచిస్తుంది. భారతీయ కుటుంబాలలోనే వ్యాపారం కొనసాగేలా చేసే ఒక నెట్‌వర్క్ నుండి తాము మినహాయించబడ్డామని కూడా వారు భావిస్తున్నారు. పటేల్ కుటుంబాలు తమ హోటళ్లను ఇతర పటేల్ కుటుంబాలకే విక్రయిస్తాయని తరచుగా చెబుతారు. దీనిని కొందరు దుర్భేద్యమైన వ్యవస్థగా భావిస్తున్నారు. ఈ మార్పుల కారణంగా అమెరికాలో జన్మించిన హోటల్ యజమానులకు , భారతీయ యజమానులకు మధ్య కొంత ఉద్రిక్తత నెలకొంది. అయితే ఈ అసంతృప్తి నిజంగా వ్యాపార వ్యూహాల గురించా లేదా మరేదైనా కారణం ఉందా అనే ప్రశ్న తలెత్తుతోంది. చరిత్రను పరిశీలిస్తే.. వలసదారులు ఎల్లప్పుడూ వివిధ పరిశ్రమలను తమదైన శైలిలో మార్చారు. భారతీయ హోటల్ యజమానులు చాలా కష్టపడి పనిచేశారు. తరచుగా ఖర్చులను సమర్థవంతంగా నిర్వహించారు. తమ కుటుంబ సంబంధాలను వ్యాపారంలో ఉపయోగించారు. కొందరు షార్ట్‌కట్‌లు తీసుకుంటే.. మరికొందరు కేవలం సమర్థవంతంగా పోటీ పడుతున్నారు. నేటి హోటల్ రంగం గతంలో ఉన్నట్లు లేదు. మార్పును అంగీకరించని వారు వెనుకబడిపోయే అవకాశం ఉంది. భారతీయ హోటల్ యజమానుల మధ్య విధేయత.. స్నేహం చాలా లోతుగా ఉంటాయి. వారిలో చాలా మంది నిరాశ్రయులుగా ప్రారంభించి, ఎక్కువ గంటలు పనిచేయడానికి.. అనేక త్యాగాలు చేయడానికి సిద్ధపడ్డారు. వారి విధానం భిన్నంగా ఉండవచ్చు, కానీ వారి విజయం వారి సామర్థ్యానికి నిదర్శనం. చివరిగా హోటళ్లను ఎవరు నిర్వహిస్తున్నారు అనే ప్రశ్న ముఖ్యం కాదు. ప్రతి ఒక్కరికీ లాభం చేకూర్చే విధంగా వ్యాపారం మారుతుందా అనేది అసలు ప్రశ్న. కార్మికులు, సందర్శకులు , కంపెనీలు అందరికీ ప్రయోజనం చేకూర్చే ఒక వ్యవస్థ అవసరం. ఒకవేళ ఏదైనా సమస్యలు ఉంటే వాటిని జాతీయత ఆధారంగా కాకుండా, వ్యాపారం ఎలా నడుస్తుందనే దానిపై దృష్టి సారించి పరిష్కరించాలి. సేవల నాణ్యత, ఉద్యోగులకు మంచి వేతనం.. తిరిగి పెట్టుబడి పెట్టడం వంటి అంశాలు ప్రాధాన్యతలుగా ఉండాలి. ఈ పోరాటం భారతీయ వర్సెస్ అమెరికన్ యాజమాన్యం మధ్య కాదు, ఎవరు ఈ పరిశ్రమకు మంచి భవిష్యత్తును నిర్మిస్తారు అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

# ఇది కదా కావాల్సింది.. త్వరలోనే రూ.55వేలకు దిగిరానున్న బంగారం

గత కొన్నాళ్లుగా ఆకాశాన్నంటుతున్న బంగారం ధరలతో సతమతమవుతున్న సామాన్యులకు ఊరటనిచ్చే వార్త ఇది. త్వరలోనే పసిడి ధరలు భారీగా దిగిరానున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.55 వేల స్థాయికి పడిపోయే అవకాశం ఉందని మార్నింగ్ స్టార్ నిపుణుడు జాన్ మిల్స్ జోస్యం చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు బంగారం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ట్రంప్ టారిఫ్‌ల భయాలు, కేంద్ర బ్యాంకుల భారీ కొనుగోళ్లు పసిడికి డిమాండ్‌ను పెంచాయి. అయితే, ఈ పరిస్థితి



తాత్కాలికమని, దీర్ఘకాలంలో ధరలు తగ్గుతాయని మిల్స్ విశ్లేషించారు. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర $3,000 – $3,150 మధ్య ఉండగా, రాబోయే ఐదేళ్లలో ఇది 38% వరకు పతనమయ్యే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ధరలు తగ్గడానికి ఆయన మూడు ప్రధాన కారణాలు వివరించారు. మొదటిది, అధిక ధరల కారణంగా బంగారం తవ్వకాలు (మైనింగ్) పెరగనున్నాయి. ఇది మార్కెట్‌లోకి సరఫరాను పెంచి ధరలను తగ్గిస్తుంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరించింది. రెండోది, ప్రస్తుతం భారీగా బంగారం కొంటున్న కేంద్ర బ్యాంకులు, ఆర్థిక పరిస్థితులు కుదుటపడ్డాక అమ్మకాలు చేపట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా, డిజిటల్ బంగారం, గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెరుగుతుండటంతో భౌతిక బంగారానికి డిమాండ్ తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక చివరిగా, బంగారం ధరల చారిత్రక ధోరణులను పరిశీలిస్తే ప్రస్తుత ధరలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని మిల్స్ అభిప్రాయపడ్డారు. అయితే, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి ఇతర నిపుణులు మాత్రం రాబోయే రెండేళ్లలో బంగారం ధర ఔన్సుకు $3,500కు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ కూడా ఈ ఏడాది చివరి నాటికి $3,300కు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఇలా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, జాన్ మిల్స్ అంచనా మాత్రం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఆశాకిరణంలాంటిది.

## సినిమా 'షో'

### ఇండస్ట్రీ తీరుపై చిర్రెత్తిపోయిన హాట్ లేడీ!

బాలీవుడ్ నటి రిచా చద్దా చిత్ర పరిశ్రమపై సంచలనం వ్యాఖ్యలు చేసింది. బాలీవుడ్ లో కొత్త వారికి అవకాశాలు ఇవ్వడం లేదని..వాళ్లలో వాళ్లకే ఛాన్సులిస్తున్నారని మండిపడింది. స్టార్ హీరో సినిమా ఫ్లాప్ అయితే అందరూ జాగ్రత్త పడతారు. తర్వాత ఎలా పనిచేయాలని ఆలోచన చేసుకుంటారు. అదే కొత్త వాళ్లకు రాకారాక ఒక ఛాన్స్ వచ్చి ఫెయిలైతే? వాళ్లు ఇంటికెళ్లాల్సిన పరిస్థితులు దాపరిస్తున్నాయి. ఈ విషయంలో బాలీవుడ్ సౌత్ ఇండస్ట్రీలను చూసి నేర్చుకోవాలని సూచించింది. ఓ సినిమా పోయినా మరో సినిమాలో అవకాశం కల్పించడం అన్నది వాళ్లకే చెల్లింది. ఇలాగైతే బాలీవుడ్ లో కొత్త వాళ్లు ఎలా రాణించగలరని ప్రశ్నించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. బాలీవుడ్ పై ఈ రకమైన ఆరోపణలు కొత్తేం కాదు. గతంలో చాలా మంది హీరోయిన్లు ఇలాంటి



ఆరోపణలు చేసారు. అలాగే బాలీవుడ్ లో లైంగిక వేధింపులు ఇష్టాను సారం జరుగుతున్నాయని..కాస్టింగ్ కౌచ్ లో భాగంగా వీటిని ప్రతీ మహిళ ఎదుర్కోవాల్సి ఉంటుందని గతంలో చాలా మంది నటీమణులు ఆరోపించిన సంగతి తెలిసిందే. అలాగే సౌత్ సినిమాల సక్సెస్ ను చూసి బాలీవుడ్ నేర్చుకోవాల్సింది చాలా ఉందని అమితా బచ్చన్, అమీర్ ఖాన్ లాంటి దిగ్గజాలు కౌంటర్ వేసిన సంగతి తెలిసిందే. వరుసగా తెలుగు సినిమాలు పాన్ ఇండియాలో సత్తా చాటడంతో బాలీవుడ్ రేసులో వెనుకబడింది. చేసిన ప్రయత్నాలేవి కలిసి రావడం లేదు. నష్టాలు తప్ప లాభాలు తేవడం లేదు. ఈ క్రమంలోనే కొందరు హిందీ దర్శకులు సౌత్ కి వెళ్లి మేకింగ్ విధానం నేర్చుకోవాలంటూ అసహనం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.

# బాలీవుడ్ సక్సెస్‌ఫుల్ సెలబ్రిటీ వ్యాపారవేత్తలు వీళ్లే




సినీ ఇండస్ట్రీలో ఉన్న సెలబ్రిటీల సంపాదన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బాలీవుడ్ లో ఇది ఇంకాస్త ఎక్కువగా ఉంటుంది. కేవలం సినిమాలతోనే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ద్వారా కూడా సెలబ్రిటీలు కోట్లలో సంపాదిస్తుంటారు. అయితే కొంతమంది సెలబ్రిటీలు అక్కడితో ఆగకుండా వ్యాపార ప్రపంచంలోకి కూడా అడుగుపెట్టి సక్సెస్ అవుతున్నారు. బాలీవుడ్ లో స్టార్ సెలబ్రిటీలందరికీ రకరకాల సైడ్ బిజినెస్‌లు ఉండగా వారిలో దీపికా పదుకొణె, సల్మాన్ ఖాన్, కృతి సనన్, కత్రినా కైఫ్, అలియా భట్, ప్రియాంక చోప్రా, రణ్‌బీర్ కపూర్ మరియు హృతిక్ రోషన్ లు టాప్ లో ఉన్నారు. పలు రకాల బిజినెస్‌లతో జనాలను ఎట్రాక్ట్ చేస్తూ బాలీవుడ్ మోస్ట్ సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్లుగా నిలుస్తున్నారు. దీపికా పదుకొనే కేవలం నటిగా మాత్రమే కాకుండా ఫిట్‌నెస్ ఔత్సాహికురాలిగా, ఫ్యాషన్ ఐకాన్ గా మంచి గుర్తింపు ఉంది. దీపికా తన క్రేజ్, అందానికి తగ్గట్టే 82ళీ%జు% అనే స్కిన్ కేర్ బ్రాండ్ ను మొదలుపెట్టి మంచి ఎంటర్‌ప్రెన్యూర్ గా పేరు తెచ్చుకుంది. దీపికా మొదలుపెట్టిన ఈ బ్రాండ్ కు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంది. కండల వీరుడు సల్మాన్ ఖాన్ హీరోగానే కాకుండా నిర్మాతగా, బిజినెస్ మ్యాన్ గా పలు రంగాల్లో రాణిస్తున్నాడు. వివిధ బిజినెస్‌లతో పాటూ కమర్షియల్ యాడ్స్ లో నటించి బాగా సంపాదిస్తున్న సల్మాన్, బీయింగ్ హ్యూమన్ పేరుతో క్లాథింగ్ బ్రాండ్ ను మొదలుపెట్టి అందులో సక్సెస్ అయ్యాడు. దీంతో పాటూ యాత్ర కంపెనీలో సల్మాన్ కు 5% వాటా ఉంది. హీరోయిన్ గా కృతి సనన్ ఇప్పటికే పలు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చింది. పలు బ్రాండ్లకు ప్రమోషన్స్ చేస్తూ బాగా ఆర్జించిన కృతి రీసెంట్ గా మ్యాజిక్ మూమెంట్స్ వోడ్కా కు కూడా ప్రచారకర్తగా మారింది. వీటితో పాటూ కృతికి హైఫెన్ అనే బ్యూటీ కేర్ బ్రాండ్ ను స్టార్ట్ చేసి మోస్ట్ సక్సెస్‌ఫుల్ బిజినెస్ ఉమెన్ గా రాణిస్తోంది. బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ నైకా తో కలిసి కే బ్యూటీ అనే బ్యూటీ బ్రాండ్ ను మొదలుపెట్టింది. కెరీర్ స్టార్టింగ్ నుంచి మేకప్ పై ఎక్కువ ఇంట్రెస్ట్ ఉన్న కత్రినా లాంగ్ లాస్టింగ్ మేకప్ ఉత్పత్తులను అందిస్తూ తన బిజినెస్‌లో సక్సస్‌ఫుల్ లో కొనసాగుతుంది. అలియా భట్ 2020లో ఎడ్ ఎ మమ్మా బ్రాండ్ పేరుతో బిజినెస్ ను స్టార్ట్ చేసింది. ఇందులో పిల్లలు మరియు తల్లుల బట్టలు దొరుకుతాయి. ఈ బట్టలను పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను వాడకుండా తయారు చేస్తారు. దుస్తులతో పాటూ పిల్లల బొమ్మలు వారికి అవసరమైన వాటిని కూడా ఎడ్ ఎ మమ్మా ద్వారా కొనుగోలు చేయొచ్చు. ఈ బ్రాండ్ అలియాకు ఏటా ఎంతో లాభాన్ని తెచ్చిపెడుతుంది. ఇక ప్రియాంక చోప్రా అనామలి అనే హెయిర్ కేర్ బ్రాండ్ ను స్థాపించి దాంతో బాగా సక్సెస్ అయింది. తక్కువ ధరలో మధ్య తరగతికి అందుబాటులో ఉండే ఉత్పత్తులను అందిస్తూ వస్తున్న ప్రియాంక తన బ్రాండ్ ఉత్పత్తుల కోసం సముద్రం నుంచి వెలికితీసిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుంది. అనామలి ద్వారా ప్రియాంక బాగానే సంపాదిస్తుంది. బాలీవుడ్ మోస్ట్ హ్యాండ్‌సమ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటుడిగా ఎంతో బిజీగా ఉంటూనే మరోవైపు పలు బ్రాండ్లను ప్రమోట్ చేస్తున్నాడు. దీంతో పాటూ ఎప్పట్నుంచో తన పేరుతో సొంత బ్రాండ్ ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఆర్బ్ పేరుతో స్నీకర్ బ్రాండ్ ను ఏర్పాటు చేసి సక్సెస్‌ఫుల్ గా దాన్ని రన్ చేస్తున్నాడు. కహోనా ప్యార్ హై తో కెరీర్ ను స్టార్ట్ చేసిన హృతిక్ రోషన్ కు HRX అనే ప్రముఖ స్పోర్ట్ క్లాథింగ్ బ్రాండ్ ఉంది. దీని ద్వారా హృతిక్ కు భారీ ఆదాయం సంపాదిస్తున్నాడు. దీంతో పాటూ హృతిక్ కు కట్ అనే జిమ్ కూడా ఉంది.

# ఐటం పాటల్లో శ్రీలీల.. కిసిక్ బ్యూటీ కండీషన్ అప్లై!

కిసిక్ పాటతో శ్రీలీల పాన్ ఇండియాలో ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఒక్క పాట అమ్మడిని రాత్రికి రాత్రే ఫేమస్ చేసింది. ఎంతో మంది భామలున్నా ఆ ఛాన్స్ సుకుమార్ కేవలం శ్రీలకు మాత్రమే ఇచ్చాడు. అమ్మడు కూడా ఆ నమ్మకాన్ని అంతే నిలబెట్టుకుంది. మాస్ అప్పిరియన్స్ తో కుర్రాకారు హృదయాలు దోచేసింది. కిసిక్ లాంటి పాటలు చేయాలంటే? అది శ్రీలీలతో మాత్రమే సాధ్యమవుతుందని ఒక్క పాటతోనే పాన్ ఇండియాకి చాటి చెప్పింది. పుష్ప-2తో అంతటి సంచలనాన్ని నమోదు చేసింది. అయితే ఆ పాట తర్వాత చాలా మంది తనని ఐటం పాటల్లో నటించమని అడిగారుట. అడిగినంత పారితోషికం చెల్లించడానికి రెడీగా ఉన్నారంది



శ్రీలీల. తాను ఎస్ చెప్పాలే గానీ కోట్ల రూపాయలు తన అకౌంట్ లో జమ అవుతాయని తెలిపింది. కానీ వచ్చిన చాలా అవకాశాలు ఇష్టం లేక వదులుకున్నానంది. కేవలం కొన్ని సినిమాల్లో మాత్రమే అలాంటి పాటల్లో నర్తిస్తానని...డబ్బులిస్తారని ఏ సినిమా పడితే ఆ సినిమాలో అలాంటి పాటల్లో నటించనని తెగేసి చెప్పిందిట. ఐటం పాటల్లో నటించిన తనకంటూ కొన్ని కండీషన్లు ఉన్నాయని...వాటికి లోబడే పని చేస్తానని తెలిపింది. జాతీయ స్థాయి చిత్రాల్లో నటించాలనే ఆశను వ్యక్తం చేసింది. అలాంటి సినిమా అవకాశాలు వస్తే వదులుకోనని తెలిపింది. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగు అమ్మాయిగా తనని గుర్తిస్తున్నారంది. ఇతర భాషల్లో అవకాశాలు వచ్చినంత మాత్రాన తెలుగు సినిమాలకు దూరమవుతానని అనుకోవద్దు. తన మొదటి ప్రాధాన్యత తెలుగు సినిమాలకేనని తెలిపింది. తెలుగులో పాటు ఇతర భాషల అవకాశాల్ని బ్యాలెన్స్ చేస్తూ కెరీర్ లో ముందు కెళ్తానని స్పష్టం చేసింది.